శాకాంబరి అలంకరణలో
మీరాలంమండి అమ్మవారు



శాకాంబరి అలంకరణలో కొలువుదీరిన మీరాలంమండి అమ్మవారు.

- మహంకాళి అమ్మవారితో పాటు శివలింగం
- 50 క్వింటాళ్లతో శాకాంబరి అలంకరణ

చార్మినార్: మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలోని అమ్మవారికి బుధవారం శాకాంబరి పూజలు ఘనంగా జరిగాయి. నిజాం కాలం నుంచి నగర ప్రజలకు కూరగాయలు అందించే అతి పెద్ద కూరగాయల మార్కెట్‌గా కొనసాగుతున్న మీరాలంమండి కూరగాయల మార్కెట్‌లో వెలిసిన అమ్మవారికి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం దేవాలయంతో పాటు అమ్మవారిని, శివాలయం, శివలింగాన్ని వివిధ రకాల కాయకూరలు,ఆకు కూరలతో ఆకర్షణీయంగా అలంకరించారు. దాదాపు 50 క్వింటాళ్ల కూరగాయలతో దేవాలయాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు.



శాకాంబరి అలంకరణలో శివ లింగం

లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి
ప్రత్యేక పూజలు

చాంద్రాయణగుట్ట: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలలో భాగంగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరించారు. శాకాంబరీ దేవిగా అలంకరించబడిన అమ్మవారిని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ పర్యవేక్షణలో తగిన ఏర్పాట్లు చేశారు.



శాకాంబరీ అలంకారంలో లాల్‌దర్వాజా మహంకాళి అమ్మవారు

బేలా ముత్యాలమ్మ ఆలయంలో..

చార్మినార్: ఆఢమాసం బోనాల జాతర ఉత్సాలను పురస్కరించుకొని బుధవారం బేలా ముత్యాలమ్మ అమ్మవారికి శాకాంబరి పూజలు ఘనంగా జరిగాయి. దేవాలయం కమిటీ అధ్యక్షులు పాటిల్ సదానంద్ యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. వివిధ రకాల ఆకు కూరలు, కాయకూరలతో దేవాలయాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు.



శాకాంబరి అలంకరణలో బేలా ముత్యాలమ్మ అమ్మవారు

బోనాలు తెలంగాణ ప్రజల సంస్కృతికి ప్రతీక

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

గోల్కొండ: బోనాలు తెలంగాణ ప్రజల సంస్కృతికి ప్రతీక అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్ రెడ్డి అన్నారు. కార్వాన్ శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయ బోనాలకు రావాల్సిందిగా కోరుతూ బుధవారం ఆలయ కమిటీ సభ్యులు అమర్ సింగ్ తదితరులు ఆయనకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. తెలుగు ప్రజల మనోభావాలను వారి పండుగలను గౌరవించేది కేవలం బీజేపీ ఒక్కటేనని అన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

అక్కన్న మాదన్న మహంకాళీ దేవాలయంలో...



యాకుత్‌పురా : ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళీ దేవాలయంలో అమ్మవారిని శాకాంబరి రూపంలో అలంకరించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి బోనాల ఉత్సవాలు



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

దూద్‌బౌలి: ఆషాఢమాసంలో నిర్వహించే దూద్‌బౌలి పైనీరు ముత్యాలమ్మ దేవాలయం బోనాల ఉత్సవాలను గురువారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయం కమిటీ చైర్మన్, ఉమ్మడి దేవాయాల ఊరేగింపు కమిటీ సభ్యులు ధోరేటి ఆనంద్ గుప్తా అన్నారు. బుధవారం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... ఈ బోనాల ఉత్సవాల్లో వివిధ ప్రముఖులు పాల్గొననున్నారన్నారు. 31 సంవత్సరాల నుంచి బోనాల ఉత్సవాలను కొనసాగిస్తున్నామని... ఇటీవల ఆలయంలో శ్రీపైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో నూతన విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించామన్నారు. పైనీరు ముత్యాలమ్మ దేవాలయాన్ని ఉమ్మడి దేవాలయాల్లో ఏడేళ్ల క్రితం చేర్చామన్నారు. ఈ బోనాల జాతర ఉత్సవాలకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు ఎమ్మెల్సీ, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. సమావేశంలో దేవాలయం కమిటీ అధ్యక్షులు వెంకటాచలం ముదిరాజ్, నూతన్, నర్సింహా రావు ముదిరాజ్, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దీక్షలో గోషామహల్ కాంగ్రెస్ నేతలు



మౌనదీక్షలో పాల్గొన్న గోషామహల్‌కు చెందిన టీపీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: కాంగ్రెస్ దీక్షలో గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర టీపీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. బుధవారం కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గాంధీభవన్ వద్ద నిర్వహించిన మౌనదీక్షలో నిర్మల్‌కుమార్ యాదవ్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

నాంపల్లి: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఆర్ఎం, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, ఏపీలో ఇస్తున్నట్లుగా రూ.21వేలు వేతనం అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో సుమారు 50వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో వివిధ కేటగిరీల్లో ఉద్యోగులు కార్మికులుగా పని చేస్తున్నట్లు వివరించారు. సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నా నేటికి పర్మినెంట్ కావడం లేదన్నారు. కార్మికులకు ఎలాంటి రక్షణ సదుపాయాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేష్ మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ పరిధిలోని కార్మికులకు రూ.24వేల వేతనాన్ని అమలు చేయాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జనగాం రాచమల్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిఫ్ అడ్మినిస్ట్రేషన్ పి.శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని చాపలగల్లీ లాల్ దర్వాజాలో బుధవారం డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ రూ.12 లక్షల జీహెచ్ఎంసీ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ... డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గౌలిపురా ఏఈ రవిచంద్, గౌలిపురా డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, కె.అర్జున్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

గన్‌ఫౌండ్రీ : ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించేంత వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని తెలంగాణ జనసమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం ఎంజేమార్కెట్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నప్పటికీ అనేక పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందలేవని ఆరోపించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రకటనలతో విద్యార్థుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న జూనియర్, ఇంజనీరింగ్ కళాశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లాల్‌దర్వాజా సింహవాహిణి అమ్మవారికి నేడు చివరి బంగారు బోనం

చార్మినార్: సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా గురువారం లాల్‌దర్వాజా సింహవాహిణి అమ్మవారికి బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించనున్నారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో చివరి బంగారు బోనంగా లాల్‌దర్వాజా సింహవాహిణి అమ్మవారికి సమర్పించనున్నారు. గౌలిపురా కోట మైసమ్మ దేవాలయం నుంచి జోగిని నిషా క్రాంతి బంగారు పాత్రలోని నైవేద్యాన్ని తలపై పెట్టుకొని దారి పొడవునా నృత్యాలు చేస్తూ లాల్‌దర్వాజాకు బయలుదేరనున్నారు. ముందుగా గౌలిపురా కోట మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం డప్పు చప్పుళ్లు... పోతురాజుల నృత్యాలతో సామూహిక ఊరేగింపు బయలుదేరనుంది.

ఉత్సాహంగా బోనాల వేడుకలు

అబిడ్స్: గోషామహల్ ప్రాంతంలో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం గోషామహల్ పరిధిలోని చందన్‌వాడి, చాక్నీవాడి, ఏడుగుళ్లు, ఐదుగుళ్లు, ఉజ్జయిని మహంకాళితో పాటు పరిసర ప్రాంతాల్లోని పలు ఆలయాల్లో బోనాల ఉత్సవాలు పెద్ద ఎత్తున చేపట్టారు. మహిళలు ఉదయం నుంచే బోనాలతో ఆలయాలకు విచ్చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. గోషామహల్ పరిసర ప్రాంతాలన్ని బోనాల వేడుకలతో సందడిగా మారాయి. రాష్ట్ర బీజేపీ కార్యాలయ కోఆర్డినేటర్ డి.గోపాల్‌జీ తదితరులు ఆలయాల్లో పూజలు చేశారు.



బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



చాంద్రాయణగుట్ట: ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పాలన చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌ఛార్జి ముప్పిడి సీతారాంరెడ్డి అన్నారు. ఉప్పుగూడ, లలితాబాగ్, చాంద్రాయణగుట్ట డివిజన్లలోని బీజేపీకి చెందిన బాలరాజు, గండూరు రామచంద్రం, నర్సింహులు గుప్తా, పడగంటి వెంకటేష్ గుప్తా, డాక్టర్ అలీఖాన్, శ్రీనివాస్ గుప్తా, జంగయ్య యాదవ్, కరుణాకర్, పెద్దయ్య, జంగయ్య, శివకుమార్, రుతీష్, వినోద్‌కుమార్ శివకుమార్‌లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జమ్మిచెట్టు రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు కరెంటు సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. మదీనా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, కిషన్‌బాగ్ ఓహెచ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు, ఘాన్సీబజార్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, బహదూర్‌పురా ఓహెచ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, కులీ కుతుబ్ షా స్టేడియం ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, షరీఫ్‌నగర్, అల్లాహ్ మసీదు ఫీడర్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అఫ్జల్‌గంజ్: 11 కేవీ గంగానగర్, రాంసింగ్‌పురా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని టోలీ మజీద్, కార్వాన్, దర్బార్ మైసమ్మ దేవాలయం, లక్ష్మీనగర్, గిరకపల్లి, బాంజావాడి, ఎంసీహెచ్ పార్క్, ఖాళీకబర్, ఆయిల్ మిల్, లంబూ కా నాలా, ఆర్య సమాజ్, రాంసింగ్‌పురా పోలీస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కేవీ సబ్జీమండి, టప్పాచబుత్ర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని ఉప్పర్‌బస్తీ, సబ్జీమండి, షర్ఫీచమన్, 2జే బస్టాప్, కార్గిల్ నగర్, పన్నీపురా, మెస్కో కాలేజ్, పాకీజా హోటల్, హరా దర్వాజా, సాయి బాబా దేవాలయం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్



గోల్కొండ: మజ్లిస్ సీనియర్ నాయకులు అజీజ్‌ఖాన్ పఠాన్ కుమారుడు సర్ఫరాజ్ ఖాన్ పఠాన్ వివాహ రిసెప్షన్ రింగ్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ రిసెప్షన్‌కు మజ్లిస్ శాసన సభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసితో పాటు మజ్లిస్ ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మేరాజ్, బలాల, ఎమ్మెల్సీలు రహమత్ బేగ్, రిజ్వి తదితరులు హాజరయ్యారు.

రాష్ట్రంలో బీజేపీ బలోపేతం

గోల్కొండ: రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని తెలంగాణ బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఆయనను బీసీ కుల సంఘాలవారు ఆయనను సన్మానించారు. బీజేపీ బీసీలకు ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్, ఉమ తదితరులున్నారు.

మొహర్రం సందర్భంగా బందోబస్తును ఏర్పాటు చేయాలి

చార్మినార్: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని పాతబస్తీలోని అన్ని ఆషూర్‌ఖానాలు, పదో మొహర్రం సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్) సంజయ్ కుమార్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 19వ తేదీ నుంచి మొహర్రం సంతాప దినాలు ప్రారంభం కానున్నాయన్నారు. అనంతరం ఆయన సంజయ్ కుమార్ జైన్‌కు దట్టీలు కట్టి మొహర్రం సంతాప దినాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

తర్వలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల బహిరంగ సభ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యంగా రాబోయే పది రోజుల్లో బారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వేములవాడ మదన్మోహన్ తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ భగాయత్‌లో భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించారు కానీ నిధులు మంజూరు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అనేకమంది విశ్వకర్మలు ప్రాణ త్యాగం చేశారని కానీ తమ సంక్షేమం కోసం ఒక్క పథకం కూడ లేకపోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చోల్లేటి కృష్ణమాచారిలతో పాటు వివిధ రాష్ట్ర శాఖ, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభించిన హోంమంత్రి

గోల్కొండ: ప్రైవేటు ఆస్పత్రుల వారు పేదలకు సైతం అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. బుధవారం షేక్‌పేట్‌లో 50 పడకల మల్టీ స్పెషాలిటీ జోయా హాస్పిటల్‌ను ప్రారంభించారు. అత్యాధునిక వసతులతో సరికొత్త రోగ నిర్ధారణ ల్యాబ్‌ను ఏర్పాటు చేసిన ఆస్పత్రి నిర్వాహకులను ఆయన అభినందించారు. తమ వద్ద అన్ని వైద్య విభాగాల సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ జోయా న్యూరిన్, డాక్టర్ శ్రీనివాస్ మోరే తెలిపారు. కార్యక్రమంలో షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ తదితరులున్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న హోంమంత్రి

క్రీడా సామగ్రిని అందజేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సలావుద్దీన్ లోధి, రాధాకృష్ణ

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గంలోని వెనుకబడిన ప్రాంతాల్లోని నిరుపేద యువకులకు స్పోర్ట్స్ మెటీరియల్ (ఆట వస్తువులు), జిమ్ మెటీరియల్ మంజూరు చేయాలని చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి అన్నారు. బుధవారం ఆయన బీఆర్ఎస్ మొఘల్‌పురా డివిజన్ అధ్యక్షులు పుప్పాల రాధాకృష్ణతో కలిసి జీహెచ్ఎంసీ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహ్మద్ సలావుద్దీన్ లోధి మాట్లాడుతూ... నేటి యువత చెడు వ్యసనాలకు పాల్పడుతూ నిరంతరం సెల్‌ఫోన్లకు బానిసవుతూ తమ అమూల్యమైన కాలాన్ని వృథా చేస్తున్నారన్నారు.

ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయండి

లంగర్‌హౌస్: బాగ్దాది దర్గా ఉర్సు ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. లంగర్‌హౌస్‌లోని హజ్రత్ సయ్యద్ షా మీరన్ హసని హుస్సైని ఖాద్రి బాగ్దాది దర్గాలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు.త్వరలో ఈ దర్గాలో ఉర్సు ఉత్సవాలు జరగనున్న సందర్భంగా దర్గా నిర్వాహకులతో సమావేశమయ్యారు. చేయాల్సిన ఏర్పాట్లు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దర్గా నిర్వాహకులు సజ్జదా నశీన్ మోతవలి సయ్యద్ సాదుద్దీన్ మొహమ్మద్ ఖాద్రి తదితరులు ఉన్నారు.



దర్గా నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్

గౌలిపురా అమ్మవారికి ప్రత్యేక పూజలు

గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత దేవాలయం, శ్రీ కోట మైసమ్మ దేవాలయంలో ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం శాకాంబరి అలంకరణ, పూజ కార్యక్రమాలను భాగ్యనగర్ జిల్లా యువ మోర్చా అధ్యక్షులు ఎ.శివచంద్రగిరి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్పొరేటర్, ఆలయ కమిటీ సలహాదారులు పాశం సురేందర్, ఆలయ ఉపాధ్యక్షులు బి.వై.శ్రీకాంత్ పాల్గొన్నారు.

అమ్మవారికి చేనేత చీర

మగ్గం పని ప్రారంభించిన ఏనుగుల వంశస్థులు

చాంద్రాయణగుట్ట: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలలో భాగంగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి చేనేత చీరను సమర్పించేందుకు మేకలబండకు చెందిన ఏనుగుల వంశస్థులు సభ్యులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు బుధవారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మగ్గం ద్వారా స్వహస్తాలతో చీరను నేయడం ప్రారంభించామని ఆ వంశానికి చెందిన గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయ్ కుమార్, సోదరుడు అనిల్‌కుమార్‌లు తెలిపారు. శుక్రవారం రోజున ఈ చీరను ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్ యాదవ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్రలతో కలిసి సమర్పించడం జరుగుతుందన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించండి

అబిడ్స్: ఆలయాల్లో పరిసరాల్లో పరిశుభ్రత ఉండేవిధంగా శానిటేషన్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ భీక్ష్వ సురేఖ పేర్కొన్నారు. బుధవారం గన్‌ఫౌండ్రీలోని తన కార్యాలయంలో శానిటేషన్ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ మాట్లాడుతూ.... వచ్చే ఆదివారం, సోమవారం రోజుల్లో గన్‌ఫౌండ్రీలోని పలు ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు ఉన్నందున పారిశుద్ధ్య సిబ్బంది పరిశుభ్రత ఉండే విధంగా ప్రత్యేక కృషి చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ దళితమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీక్ష్వ ఓంప్రకాష్, జగత్ పాల్గొన్నారు.



PUBLIC NOTICE

It is hereby informed to the General Public that my client **Mrs. Samdani Begum** W/o Mr. Abdullah Rashid, R/o. H.No.8-2-608/9, Shaikpet Village, Road No.10, Banjara Hills, Hyderabad, Telangana State is the regd. Owner of the property bearing H.No.8-2-608/9, Shaikpet Village, Road No.10, Banjara Hills, Hyderabad, AP & Telangana State building of plinth area extent 430 Sq.fts out of which 128 Sq.Yards Doct. No. 278/1988 and GPA Doct. No. 1639/1987 and Agreement of Sale Regd. Doct. No.1116/ 1987, Sale Deed Doct. No. 2249/1985 and 222 Sq. Yards Doct. No.277/1988, GPA Doct. No. 1638/1987 and Agreement of Sale Doct. No. 1115/1987, Doct. No.683/1985 all registered before SRO, Hyderabad South and the original documents related to the said property was misplaced on 08.07.2023 while traveling in RTC Bus from working Womens Hostel to Kaman. if anyone find kindly handover it to the undersigned and he/she will be awarded suitably. If anybody make any kind of transaction over the above said property It will be treated as Null and void.

Sd/- S.Kantha Reddy
B.Com., LLB
Advocate
H.No.6-3-71, Shivarampally, Rajendra Nagar, GHMC, RR Dist - 500052
Date: 13.07.2023 Cell: 9392435888

స్థిత ప్రజ్ఞుడు పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: అలనాటి నటుడు శోభన్‌బాబుకు నేటికీ వీరాభిమానులు ఉన్నారని పలువురు ప్రముఖులు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో శోభన్‌బాబు వీరాభిమాని చల్లగాలి వెంకటరాజు ఆధ్వర్యంలో శోభన్‌బాబుపై రచించిన 'స్థితప్రజ్ఞుడు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. అదేవిధంగా వాణి గిరిజ సంగీత నాటక కళాసమితి ఆధ్వర్యంలో శోభన్‌బాబు అభిమానుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా మాట్లాడుతూ.... ఉమ్మడి రాష్ట్రాలతో పాటు తమిళనాడుకు చెందిన అభిమానుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పలువురు అభిమానులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భూగర్భ జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి.ప్రకాష్, మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, విశ్రాంత డీజీపీ గోపీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

అబిడ్స్: ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారని వాటిని అరికట్టాలని విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డికి గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, ప్రదీప్‌రాజ్, జగపతిసాయిలు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గోషామహల్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు తమ ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఆయా విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణ చేపట్టాలన్నారు.

ఆలయంలో శాకాంబరీ పూజలు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి మాతేశ్వరీ ఆలయంలో 74వ వార్షిక బోనాలలో భాగంగా బుధవారం అమ్మవారికి శాకాంబరీ అ లంకారం చేశారు. వేద పండితులు అమ్మవారికి నవ మహా హారతులు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కీర్తి నరేందర్ ముదిరాజ్, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

గోల్కొండ: టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేకి అని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జ్ టి. జీవన్ సింగ్ అన్నారు. రైతులకు 3 గంటలు మాత్రమే ఉచితంగా విద్యుత్ అందిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటనను ఖండిస్తూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జీవన్ సింగ్ మాట్లాడుతూ.... బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ ఉచితంగా అందిస్తుందని, అంతేకాకుండా రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి ప్రకటన కాంగ్రెస్ ఎంత మోసకారి పార్టో జనాలకు తెలిసిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్వాన్ అడ్‌హాక్ కమిటీ సభ్యుడు కె. శేఖర్ రెడ్డి, బి. శేఖర్, రాములు తదితరులున్నారు.